# అనుబంధాలు

**-పోలాప్రగడ రాజ్యలక్ష్మి**

గౌతమీ ఎక్స్‌ప్రెస్ తెల్లవారు ఝామున గోదావరీ బ్రిడ్జిమీంచి నడుస్తోంది మెల్లగా. గోదావరీ అలల మీంచి వస్తూన్న చల్లని గాలి తల్లి ప్రేమలా హాయిగా ఉంది.

అమ్మ ప్రేమ అందరికీ ఆనందమే. ఈ నదిలోని నీరులా ప్రాణం పోస్తుంది. ఆ ఆలోచనల ఆనందం అంతా ఇంతా కాదు. గౌతమీ నదిలా, సుదీర్ఘం అనుకుంది రామసీతమ్మ.

ఇంతలోకే గోదావరి స్టేషన్ దాటి, రాజమండ్రీ స్టేషన్ వచ్చింది.

షాలు తీసుకుని వంటి నిండా కప్పుకుని, బ్రీఫ్ కేసు తీసుకుని రైలు దిగి, స్టేషన్ ఇవతలకి వచ్చి 'తనకోసం స్టేషన్‌కి బాలూని పంపుతానందీ అక్క, రాలేదేమిటి?' అనుకుని అటూ, ఇటూ పరిశీ

ఆటోలూ, రిక్షాలు, జనం, హడావిడిగా ఉంది. అందరూ తొందరగా ఇళ్ళకి వెళ్ళాలనే ఆతురత, హడావిడీ.

దూరాన టేక్సీకి జార్లబడి నుంచున్న డ్రైవర్ని ఉద్దేసించి, కుడిచేతిని ఊపుతూ టేక్సీని పిలిచింది. అతను వస్తూనే రామసీతమ్మ చేతిలోని బ్రీఫ్ కేస్ తీసుకుని, వినయంగా 'ఎక్కడికి వెళ్ళాలండీ' అని అడిగాడు.

''ఎక్కడికి వెళ్ళాలండీ?'' మళ్ళీ అడిగాడు.

''మా అక్కగారింటికి'' -అంది.

''తమరు ఊరు పేరు చెప్పాలండి'' అన్నాడు.

''అవును నీకు ఊరు పేరు చెప్పలేదు కదూ? చెప్తాను పెట్టి కార్లోపెట్టు'' అంది ఆవేశంగా, కోపంగా చూస్తూను.

''ఊ..అడివి వెళ్ళాలి'' అంది.

''మీరేదో కొత్తగా మాట్లాడుతున్నారు.

''ఈ జిల్లా మొత్తం నేను ఎరగని ఊరు లేదండి''

''అవిడి అనే, ఊరు మాత్రం ఉంది'' అన్నాడు కారుడ్రైవర్ వినయంగాను.

''అదేరా! మేము చిన్నప్పటి నుంచీ అలా సరదాగా పిలిచేవాళ్ళం'' అంటూ వెళ్ళి టాక్సీలో కూర్చుంది రామసీతమ్మ.

పై మీద కండువా తలపాగాలా చుట్టుకుని స్టీరింగు దగ్గర కూచుని, కారు నడుపుతూ, ''అమ్మా మీరు ఒక్కరే వస్తున్నారు? ఎక్కడి నుంచండీ'' అన్నాడు ఆసక్తిగాను.

కొద్దిగా చిరునవ్వుతో '' అమెరికానుంచి మా అక్కగారి అమ్మాయి పెళ్ళి అనీ'' అంది రామసీతమ్మ.

''ఆడోళ్ళు ఒక్కరే వచ్చారండీ, భయం వేయలేదాండీ?'' అని అడిగాడు డ్రైవర్-

కొంచెం నవ్వుతూ రామసీత అంది ''చేతినిండా డబ్బు, చదువు ఉన్న ఏ ఆడపిల్ల అయినా ఎంతదూరమేనా వెళ్ళగలదు ఈ కాలంలోను. ఇంకా, మారని మన పల్లెటూళ్ళు వారు తప్పు'' అంది.

టేక్సీ శరవేగంగా పోతోంది. చిన్నతనంలో, ఇక్కడ పుట్టి పెరిగింది తను. జననీ జన్మభూమి నిర్మలత్వం, ఎంత హాయినో ఇస్తుంది. ధవళేశ్వరం రోడ్డు మీంచి కారు మెత్తగా పోతోంటే, కుడివైపు కాలవ నీరు సుడులు తిరుగుతూ ప్రవహిస్తోంది. కొద్దిగా మబ్బుపట్టింది. చల్లనిగాలి వీస్తోంది. ఆ గాలితోబాటు చిన్ననాటి జ్ఞాపకాలు మోసుకు వచ్చి మనసుని కుదిపింది. వళ్ళు ఒక్కసారి పులకరించింది. రామసీతకి.

అమ్మ, నాన్నగారూ పుట్టిన, ఊరు, అన్నీ కళ్ళ ముందు రూపుకట్టాయి. కళ్ళు కొంచెం చెమర్చాయి. గుండె దడ దడ లాడింది గొంతునొప్పితో, ఇబ్బంది పడసాగింది. ఆ బాధని మరిచిపోవడం కోసం ప్రకృతిలోకి చూసింది.

> కారు శరవేగంగా పోతోంది రామసీతమ్మ ఆలోచనల్లాగానూ, ఆకాశంలో మబ్బుల్లాగానూ. సన్నని తుంపరపడుతోంది పన్నీటి జల్లులాగాను. సూర్యుడు మబ్బుల్లోంచి ఉండుండి కనిపించీ కనపించనట్లు తెల్లని కాంతులు మాత్రం కనిపిస్తున్నాయి కారు అవిడి ఊరులోకి వచ్చింది.

తన చిన్నతనంలో, దాదాపు, ఏభై ఏళ్ళ నాటి మాట.

అమ్మ ఆవేళ చాలా బాధపడింది. అన్నం తినలేదు. అక్క కూడా, ఏడుస్తూ మంచం ఎక్కి పడుకుంది. ఎక్కి ఎక్కి ఏడుస్తూను.

''ఏం జరిగింది. ఎందుకలా ఏడుస్తున్నారు'' అని ఎన్నిమార్లు అడిగినా ''నువ్వు చిన్నపిల్లవి. నీకు, తెలియదు'' అందే కాని, అమ్మ చెప్పలేదు. వాళ్ళ బాధ నా మనసుని కలచి వేసి, వ్యాకుల పడ్డాను. ఇల్లంతా తిరిగాను. నాన్నగారిని అడిగితే, రాసుకుంటూన్న కాగితాల కేసి నుంచి, నా వైపు చూసి ''పెద్దదానివైనాక, ఈ బాధలు నీకూ ఎలాగూ తప్పవు. వెళ్ళి ఆడుకో'' అన్నారు. కాని పట్టుదలగా, అమ్మని గట్టిగా అడిగాను కోపంగాను.

నా మాటలకు ఆవేశం వచ్చి,

''ఏముంది? నే చెప్పటానికి. నా మాట విలువ ఈ ఇంట్లో ఉందనా? నన్నో మనిషిగా చూస్తున్నారా? మీ నాన్నగారు. నాకు చెప్పకుండా గోదావరి అవతల సంబంధం కుదుర్చుకుని వచ్చేశారు. పైగా, తాంబూలాలు పుచ్చేసుకున్నారుట. తన చెల్లెలు కొడుకుట. విన్నావా? ఈ విడ్డూరం. నావళ్ళు రవ, రవ లాడిపోతోంది. ఈ పరిస్థితిలో, ఏం చెయ్యాలో తోచక తల బద్దలు కొట్టుకోవాలనిపిస్తోంది.'' అంటూ చేతిలోని గిన్ని భళ్ళున పడేసింది. ఆవేదనతో ముఖం ఎర్రబడింది.

''అమ్మా! అమ్మా!'' అంటూ ఆమె రెండు చేతులూ పట్టుకున్నాను గట్టిగా. నన్ను విదిలించబోయింది.

నేను, ప్రేమగా ఆమెని చుట్టేసి, లాలనగా, కళ్ళల్లోకి చూస్తూ కొంచెం నవ్వుతూ

''నీకు ఉన్న దైవభక్తికీ, పంచకావ్యాలు చదవిన సంస్కారమూర్తివీ, ఇలాగేనా ఆవేదన పడ్డం'' అన్నాను వినయంగా చూస్తూ.

''ఈ పరిస్థితిలో, ఏం చేసినా భర్తకి ఎదురు తిరిగిందని బంధువులూ, స్నేహితులూ, కాకుల్లా పొడుస్తారు. నేనే ఓర్పుగా ఉండాలి. అంతేనా, కన్నతల్లి ప్రేమకి దూరంగా, గౌతమీ నది అడ్డుగా నిలిచింది. ఇప్పుడు మళ్ళీ నా కూతుర్ని గౌతమీ నది అవతలకు తీసుకువెళుతోంది. మరి నా ఆవేదన మరింత అవుతోంది'' అంది. జాలిగొలిపేలా, బేలగాను. కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూను.

కోపంగా వీధి గదిలోంచి నాన్నగారు ఆవేశంగా అరుస్తూ వచ్చారు.

''నా కంఠంలో ప్రాణం ఉండగా ఈ ఇంట్లో ఆడపెత్తనం సాగనివ్వను. అరిచి గీ పెట్టినా, ఈ పెళ్ళి జరగవలసిందేను. ఏం నా చెల్లెలు కొడుక్కి ఇచ్చి పెళ్ళి చేస్తే మేనరికం అని, అన్నయ్య కూతురని ప్రేమగా చూస్తుంది. మన పిల్లకు కూడా, అత్తవారి ఇల్లని భయముండదు అని నేను ఆలోచించాను. నేనేదో పెద్ద తప్పుపని చేసినట్లు పెద్దగొడవ, ఇంట్లోను. అది చిన్నపిల్ల. నీమాటలతో దాన్ని భయపెట్టకు. ఇంక ఈ ఇంట్లో, ఎవరిమాటలు వినపడ్డా, ఊరుకోను. జాగర్త! నా మాటకి ఎదురుచెప్పావో, నేను వెళ్ళి సన్యాసుల్లో కలుస్తాను'' అన్నారు గుడ్లు ఉరిమిచూ

స్తాను.

అంతే ఆయన మాటలకు అంతా అవాకు అయిపోయాము. ఇల్లంతా నిశబ్దంగా మారిపోయింది. నాన్నగారు అనుకున్న ప్రకారం అక్క పెళ్ళి వైభోగవంతంగా జరిపించేశారు.



రామసీత కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ, ప్రకృతిలోకి చూసింది. అప్పుడే కడియం బ్రిడ్జి మీంచి కారు వెడుతోంది. ఆకాశాన మబ్బులు పరుగులు పెడుతున్నాయి. శ్రావణమాసం కదా? చేమంతులు, గులాబీలూ, కనకాంబరాలూ విరగబూశాయి. పసిపాపల బోసినవ్వులా పూలతోట అంతా చూస్తుంటే హాయిగా ఉంది.

సైకిళ్ళ మీద అరటి గెలలు పట్నంలో అమ్ముకొందుకు పట్టుకు వెడుతున్నారు. ఎంత దూరం వెళ్లినా గౌతమీ నది అందాలూ, పల్లెటూరి వాతావరణం మరచిపోలేను పులకించే హృదయంతో అనుకుంది రామసీత.

''మీ బంధువులందరినీ వదలి, అమెరికా దాకా వెళ్ళిపోయారు మీరు. బెంగగా ఉండదాండీ'' అన్నాడు టాక్సీడ్రైవర్ వెనక్కి తిరిగి చూస్తూ.

ఆ మాటలకి ఒక నిట్టూర్పు విడిచింది రామసీత బాధగా, ''రక్తసంబంధమున్న వారి ప్రేమలు ఎక్కడికి పోతాయి. కానైతే, పూర్వకాలంలో వెర్రి ప్రేమలు తగ్గాయి. విద్య ఇచ్చిన వివేకం వల్ల, ధనం మూలమిదం జగత్ అన్నారు కదా? విదేశాలలో, సంపాదించిన డబ్బులు వల్ల ఇంకా ప్రేమ గౌరవం పెరుగుతోంది మన వాళ్ళకి, మా చెల్లెలు అమెరికాలో ఉంది అంటూ ఆనందంగా కళ్ళు మెరిసిపోతూ చెప్పుకుంటున్నారు'' అంది.

''అంతేలెండి. ఈ రోజుల్లో భార్యాభర్తల ప్రేమ కూడా డబ్బుతోనే కొలుస్తున్నారు. మొన్నటిదాకా ఎడ్ల బండి తోలేవాణ్ణండి. నువ్వు సంపాదించింది ఎడ్లు తిండానికే సరిపోతోందని నా భార్య గొడవ చేసేదండి, రోజూను. టేక్సీ నడపడం నేర్చుకున్నాక, మరిన్ని డబ్బులు మిగులుతున్నాయి. ఇప్పుడు నా పెళ్ళాం నేనంటే, ఎంతో ప్రేమ చూపిస్తుందండి'' అని డ్రైవరు తన బాధ చెప్పాడు.


అతనితో ఎక్కువ మాట్లాడ్డానికి ఇబ్బంది పడింది రామసీత.

ఇంతలోకి కారు గతుగుల రోడ్డులోంచి ఇబ్బందిగా నడుస్తోంది. కవిగారి కవితలాగానూ, కారు వేగంగా పోతోంది. రావులపాలెం బ్రిడ్జి వచ్చింది బాణంలా దూసుకుపోతోంది గోదావరి బ్రిడ్జి మీంచి.

మళ్ళీ అమ్మ, గోదావరి దాటడానికి, ఎంత బాధపడేదో జ్ఞాపకం రాసాగాయి. గోదావరి ప్రయాణం, పెద్ద యజ్ఞంలాగా ఉండేది. లంక అంతా నడచి వెళ్ళాలి. తెల్ల వాగట్ల లేచి, వెళ్ళేవాళ్ళం, వానాకాలం అయితే గోదావరి అద్దరికీ ఇద్దరికీ తాసి ఉండేది. పడవలో వెడుతుంటే, పడవ అటు ఇటు ఊగుతూ ఉండేది. కొందరైతే, బుట్టలూ, తట్టలూ, మేకల్ని కూడా తీసుకు వచ్చేవారు, చిన్న పిల్లలకి భయం తెలియక, ఇది ఒక అనుభూతిగా ఆనంద పడేవాళ్ళం.

వేసంకాలం అయితే పాట్రేవుపడేది. అది మరీ కష్టం ఇసకలో నడవడం, ఎండకు పైన నెత్తి మాడేది, క్రింద ఇసక కాలేది. అల్లాంటప్పుడు లంకలో నడవడం కష్టం. పైగా, కనీసం నలుగురేనా సాయంతో వెళ్ళాలి. వంటరిగా వెడితే రకరకాల భయాలు, చెట్టుచాటునా పుట్టచాటునా, ఏవేనా ఉంటాయి అని. పరుగు, పరుగున నడవవలసి వచ్చేది. అందువల్ల గోదావరి దాటే ప్రయాణం అంటే కష్టాల్లోకెల్లా కష్టాలుగా ఉండేది. అమ్మబెంగ ఇంతా

అంతా కాదు. కొన్నాళ్ళు కన్నవారింటికి వెళ్ళినప్పుడు, మళ్ళీ తన కూతుర్ని గోదావరి అవతల ఇచ్చినప్పుడూ ఆవేదన పడేది. డబ్బు ఉన్నా సుఖంలేని రోజులు, పరదేశీయులు పాలించే రోజులు, కిరసనాయిలు దీపానికి కూడా నోచుకోని రోజులు. ఆముదపు దీపాలతో రాత్రిళ్ళు భయం భయంగా గడిపేవారం, పసికూన కూడా ఫ్యాన్ లేందే పడుకోదు. ఇప్పుడు సుఖాలు అలవాటైపోయాయి. డబ్బుతో ఈరోజుల్లో అంతా సుఖమే.




ఏ అమ్మకేనా తనని కన్నవారూ, తను కన్నవారూ, దగ్గరగా ఉండాలనే తపిస్తుంది. గోదావరీ బ్రిడ్జి కడతారు అని ఓ రోజు పత్రికలో వచ్చిన వార్తకి అమ్మ ఆనందం గౌతమీ నది అంత. ఆ వేళ పేపరులోని వార్త ప్రత్యేకం ఆ వీధిలో వెళ్ళేవారందరినీ పిలిచి, మరీ చెప్పింది. అరుగుమీద పేపరు పెట్టుకుని, కూచుని, కళావెంకట్రావుగారు శంకుస్థాపన చేస్తారుట, మనకి పరదేశీ పాలన పోయింది కదా. అంతా, ఆనందమే అని, తన బిడ్డను, మనుమలనూ, చిటికలో వెళ్ళి చూడవచ్చును అనుకుంది పాపం.

ఏపనేనా అనుకున్నంత సులువుగా పనులు అవుతాయా? అమ్మ గోదావరి బ్రిడ్జి కట్టడం చూడనే లేదు. వెళ్ళిపోయింది. ఈ ముసలితనంలో నాకు పెద్ద బెంగతీరింది. తనకూ తనవారికీ వారధి రాబోతోంది. ప్రేమవారధి రాబోతోంది, తన పుట్టింటికీ, తన కూతురింటికీ, దూరాలు తీరాయి అని సంతోషం ఆమెకి. మరింత ఆయుషుని కూడా ఆ భగవంతుడు ప్రసాదించి ఉంటే? ఎంతబాగుండును. అలా లేకుండా అమ్మ వెళ్ళిపోయింది. తల్లి గౌతమీ నదిలో కలిసిపోయింది. అమ్మ బొమ్మ కూడా లేదు.

ఈనాడు ఇలా కారులో చిటికలో, రావులపాలెం బ్రిడ్జిమీంచి సరదాగా ప్రకృతి అందాలు చూస్తూ ప్రయాణం చేస్తున్నాను. అమెరికా నుంచి అవిడి దాకా, కాలుకందకుండా ప్రయాణం చేస్తున్న నన్ను చూసి, ఆమె ఆనందం అవధులు దాటును అనుకుంది రామసీత.

తల్లి జ్ఞాపకాలతో కళ్ళు తడి అయ్యాయి. ఒక వైపు కొబ్బరిచెట్లు పొట్టిగానూ కొన్ని పొడుగ్గాను ఉన్నాయి. బరువైన కొబ్బరి బొండాలతో సగటు మనిషి సంసారపు భారంతో ఉన్నట్లు తోచింది. మరొక వైపు పడవలు వెళ్ళే కాలవ గలగలమని సంగీత ధ్వనులతో ప్రవహిస్తోంది. కోనసీమను చూసేవారి చూపులో రసజ్ఞత ఉంటే, ప్రకృతి అంతా కన్నుల పండగగా తోస్తుంది. కాశ్మీరుని మరిపిస్తుంది. పనస తోటలూ, పసుపు పంటలూను.

కారు శరవేగంగా పోతోంది రామసీతమ్మ ఆలోచనల్లాగానూ, ఆకాశంలో మబ్బుల్లాగానూ.

సన్నని తుంపరపడుతోంది పన్నీటి జల్లులాగాను.

సూర్యుడు మబ్బుల్లోంచి ఉండుండి కనిపించీ కనపించనట్లు తెల్లని కాంతులు మాత్రం కనిపిస్తున్నాయి.

కారు అవిడి ఊరులోకి వచ్చింది. పల్లెటూరు కావడం వల్ల తమ పనులు మానుకుని, ఈ కారు ఎవరింటికి వస్తోంది. కారులోని వారు ఎవరు? అన్నట్లు వాళ్ళ కళ్ళు కారు మీద ఉన్నాయి.

''ఆ ఎత్తయిన అరుగులు, ముందు కాంపౌండు వాలూ ఉన్న గేటు దగ్గర ఆపు'' అని చెప్పింది రామసీత.

వాకిలిముందు కారు ఆగడంతో, డోర్ తోసుకుని దిగింది. వాకిట్లోనే ఆకాశం కేసి ఒకసారి చూసి, మెడ నెప్పి పుట్టి కాబోలు భూమికేసి ఒక మారూ చూస్తున్నారు అక్కా బావాను-

''వచ్చావా చెల్లాయీ'' అంటూ ''నీ కోసమే ఎదురు చూస్తున్నాము'' అంది ఆప్యాయంగా కౌగలించుకుంటూ అక్క- తల్లి ప్రేమను గుర్తుచేస్తూ.

''అక్కా! బావ ఏమిటి? ఆకాశంలోకి ఎదురుచూస్తున్నాడు'' అంది కొంటెగా.

''ఆ....నీకోసమే మరదలుగారు ఆకాశంలోంచి విమానంలో, తిన్నగా అమెరికానుంచి వచ్చి మా నెత్తిన దిగుతారనీ'' అన్నాడు.

''చెల్లాయ్! ఆయన మాటలకేంగానీ, ఈ మబ్బులో పొద్దు కనిపించక వెతుకుతున్నాము. సూర్యుడు కనిపించకపోతే ఆయనకీ, ఆయనగారితో బాటు నాకూ భోజనం ఉండదు మరి'' అక్క బావని చేత్తో చూపిస్తూ కొంటెగా అంది.

పక పక నవ్వుతూ ''బావా? దేశం శరవేగంగా మారిపోతున్నా నువ్వు మాత్రం మారలేదు'' అంది.

''ఇదిగో మరదలూ మాటలు మాత్రం జాగర్తగా రానీ, అమెరికాలో బెడ్‌కాఫీ ఏగా, నీకూ?'' కొంటెగా అన్నాడు నవ్వుతూ. '' భూమినీ ఆకాశాన్నీ నమ్మిన రైతుని నేను'' అన్నాడు.

''అవును గానీ అక్కయ్యా నీ కూతుర్ని బొంబాయి కుర్రాడికి ఇచ్చి చేస్తున్నారు. నువ్వు బెంగపెట్టుకోవా? దూరం అని?''

''అమ్మలాగా ఆరోజుల్లోలాగా, అమాయకపు ప్రేమలు లేవు. ఎక్కడ ఉన్నా సుఖంగా ఉండాలనే కోరిక. ఎక్కడ ఉన్నా తల్లి ప్రేమ అనంతం తల్లి గోదావరిలా ప్రేమ పూరితమైనది.''

అక్కగారి ఆప్యాయతకు రామసీత ఎంతో ఆనందించింది.

''అమెరికాలో ఉన్నా అక్కా బావా మీద ప్రేమతో వచ్చావు కదా?'' అంది.

''పిన్ని వచ్చింది, పిన్ని వచ్చింది'' అని పిల్లలు అందరూ ఆనందంగా అరుస్తూ ''మాకేం తెచ్చావ్?'' అంటూ అడిగారు.

వాళ్ళందరినీ ఆప్యాయంగా ముద్దు పెట్టుకుంటూ ''చాలా తెచ్చాను'' అంది సంతోషంగా.

అందరి కబుర్లతోనూ, నవ్వులతోనూ, పెళ్ళిపందిళ్ళు నవ్వుల, పువ్వుల, పందిళ్ళుగా అయ్యాయి.

ఎన్నాళ్ళకో కలుసుకున్న ఆ అక్కా చెల్లెళ్ళ ప్రేమను చూస్తే గుండెలు పులకరించక మానతాయా? ఆ అనుబంధాలు- అయినవారిలో, వర్ణనాతీతం మాటలకందని మమకారాలు. దూరం వెళ్ళినకొద్దీ, దగ్గర అవుతాయి. కాని, దూరం చేయవు అనుకుంది రామసీత స్వానుభవంతో.

★

పోలాప్రగడ రాజ్యలక్ష్మి
2/డి, బ్రహ్మానంద నగర్,
మలక్‌పేట, హైదరాబాద్-36



## అదృష్టమంటే సంఘవిదే!

'తాజ్‌మహల్' తర్వాత సంఘవికి చెప్పుకోదగిన హిట్ చిత్రం ఏదీ లేదు. ఆమధ్య వచ్చిన 'పట్టుకోండి చూద్దాం' ఒకటి చెప్పుకోవచ్చు. అయినా సంఘవి ఒక క్షణం ఖాళీ లేని విధంగా సినిమాల్లో బుక్ అయిపోతూనే వుంది. 'సిందూరం' ఆమె కెరీర్‌ని గొప్ప మలుపు తిప్పుతుందనుకున్నారంతా. కానీ ఆ సినిమా ఫ్లాప్ అయింది. అయినా కూడా సంఘవికి పెద్దగా నష్టం ఏం జరగలేదు. ఇప్పుడు జగపతి బాబుతో సంఘవి తొలిసారిగా జంటగా నటిస్తున్న 'ఆహా' చిత్రం ఆమెకి మరింత బూస్ట్‌నివ్వచ్చని సినీ జనాల ఉవాచ. హీరోయిన్‌గా అనేక అవకాశాలతో ముందుకు దూసుకెళుతోన్న సంఘవిని చూస్తే రాణించలేకపోతున్న కొంతమంది స్టార్‌లకి ఈర్ష్యగానే వుంటుంది. సంఘవి రియల్లీ లక్కీ హీరోయినే మరి!

-జె.ఎం.